తెలుగీకరణ - తేట తెలుగు

మదుసూదన్‌రెడ్డి కాకులవరం – mkreddy1@yahoo.com

అట్లాంటలో 2000 సంవత్సరంలో జరిగిన ATA ఆరవ మహాసబలో డాక్టర్ సి. నారాయణరెడ్డి గారు తెలుగు బాష 75 శాతం సంస్కృత బాష పదాలను జీర్ణం చేసుకున్నది అని చెప్పారు. మాజీ ప్రధాన మంత్రి పి. వి. నరసింహారావు గారు అదేమాట అన్నారు. తెలుగు బాష 75 శాతం సంస్కృత పదాలతో అజీర్ణమై ఆయాస పడుతుంది అని వేదిక ఎక్కి అరవాలనిపించింది. తెలుగు ద్రవిడ బాష. సిందూలోయ నాగరికతలో మాట్లాడిన 'ప్రోటో ద్రవిడియన్' (Proto-Dravidian) బాషలో నుంచి పుట్టిన బాష. సంస్కృతం ఇండో యూరోపియన్ బాష కుటుంబానికి చెందినది. మూడువేల సంవత్సరాల క్రితం ఆర్యులు మనదేశానికి తీసుకువచ్చిన బాష. పదివేల సంత్సరాల క్రితం ఇండో యూరోపియన్ బాష మాట్లాడేవారు టర్కీ దేశ ప్రాంతంలో నివసించేవారని చరిత్రకారులు చెపుతారు.

సంస్కృతం, ఇంగ్లీష్, జర్మన్, లాటిన్, అరబిక్ మొదలగు బాషలు ఇండో యూరోపియన్ కుటుంబానికి చెందినవి. తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం, బ్రాహి ద్రవిడ కుటుంబానికి చెందినవి. ద్రవిడ బాషలకు ఇండోయూరోపియన్ బాషలకు వున్న కొన్ని బేదాలను పరశీలిద్దాం.

సంస్కృతం లాంటి ఇండో యూరోపియన్ బాషలలో హల్లులు (consonants) స్వచ్చం. ఉదాహరణకు ఇంగ్లీష్‌లో హల్లులు k (క్), g (గ్). ద్రవిడ బాషలో హల్లులు అచ్చుల (vowels) తో కలసివుంటాయి. తెలుగులో క=క్+అ, గ=గ్+అ. అచ్చులతో ఇమిడి యున్న బాష కావున తెలుగును అజంతా బాష అని అంటారు.

ఇండో యూరోపియన్ బాష పదాలలో మూలం (root) ఏర్పడటానికి రెండు లేక ఎక్కవ హల్లులు మిళితం (contract) అవుతాయి. ఇంగ్లీష్ పదం 'street' లో 'స్, ట్, ర్' మూడు హల్లులు మిళితమై మూలం ఏర్పడింది. అలాగే సంస్కృత పదం 'స్త్రీ' లో 'స్, త్, ర్' మూడు హల్లులు మిళితమయ్యాయి. ఈ పద్ధతి అన్ని ఇండో యూరోపియన్ బాషలలో కనిపించే సహజ గుణం. ఈ గుణం ద్రవిడ బాషలలో కనిపించదు. ద్రవిడ బాషలలో రెండు హల్లులు మిళితం అయినప్పుడు, ఒకే (same) హల్లు అయితే తప్ప అవి కలవవు. ఉదాహరణకు 'అమ్మ' అన్న పదంలో 'మ' కు 'మ' వత్తు. ముప్పై శాతం తెలుగు (ద్రవిడ) బాష పదాలలో ఈ గుణం కనిపిస్తుంది. ఈ చిన్న పరీక్షతో

ప్రతి పదం మూలం సంస్కృతమా? తెలుగా? అని సులబంగా చెప్పవచ్చు. ఉదాహరణకు 'గ్రామం', 'అగ్ని' సంస్కృత పదాలు, 'పల్లె', 'నిప్పు' తెలుగు పదాలు.

తెలుగులో ఆది కవి నన్నయ అని చెప్పుకుంటాం. ఆయన సంస్కృత మహాభారతాన్ని 1024 A.D. లో తెలుగులోకి అనువాదం చేశాడు. తమిళ భాషలో 2000 సంవత్సరాలకు పూర్వం రాసిన గ్రంధాలు వున్నాయి. తిరువల్లూవర్ 'తిరుక్కురాల్' అన్న తమిళ గ్రంధాన్ని100 B.C. లో రాసాడు. వంద మైళ్ల దూరంలో వున్న తమిళులతో పోల్చి చూస్తే, మనం వెయ్యి సంవత్సరాలు వెనుకకు వున్నాం. దీనికి కారణమేమి? క్రీస్తు పూర్వం 2వ శతాబ్దం నుండి క్రీస్తు తరువాత 7వ శతాబ్దం వరకు బౌద్ధ రాజులు తెలుగు ప్రాంతాన్ని పరిపాలించారు. వీరిలో ముక్యులు శాలివాహనులు, విష్ణుకుండినులు. వీళ్లు పాలి భాషను రాజభాషగా పోషించారు. బౌద్ధగురువులు ప్రజలకు పాలి భాష రాదని తెలిసి, తెలుగులో బౌద్ధ కతలు చెపితే ప్రజలకు గ్నానోదయం కలుగుతుందని తెలుగు భాషను పోషణ చేసారు. ఆ సమయంలో తెలుగులో వచ్చిన గ్రంధాలన్నీ బౌద్ధమతం గురించినవే. 7వ శతాబ్దంలో హిందూ రివైవలిజం (Revivalism) జరిగిన సందర్భంలో బౌద్ధ, జైన గ్రంధాలను నాశనం చేశారు. అందుకే తెలుగు, కన్నడ భాషలలో ఆది గ్రంధాలు అనువాదాలుగా మిగిలిపోయయి.

ఇప్పడు తెలుగు దినపత్రికలలో కనిపించే తెలుగుభాష లిపి వరకే పరిమితం. 75 శాతం సంస్కృత పదాలను వాడి, తెలుగు వచ్చిన వాళ్ళను కూడ చదువురాని వాళ్ళుగా మారుస్తున్నారు. ఈ సంస్కృతీకరణ రోగం మనకు నన్నయ నాటి నుండి మొదలైంది. నన్నయ మహాభారతాన్ని అనువాదం చేసినప్పుడు 50 శాతం పైగా సంస్కృత పదాలను వాడాడు. 12వ శతాబ్దంలో పాల్కురికి సోమనాదుడు, 'బసవ పురాణం' అన్న గ్రంధాన్ని తెలుగు ద్విపదలో రాసి, తెలుగు సంస్కృతానికి సమానం అని చాటి చెప్పాడు. తరువాత వచ్చిన కవులు తిక్కన, పోతన పాల్కురికి దారిలో నడిచారు. క్రిష్ణదేవరాయల అష్టదిగ్గజాలను భాష విషయంలో అష్టదరిద్రులని చెప్పవచ్చు. వీరు తమ రచనలలో తెలుగు సంస్కృతీకరణను మరొక్క మెట్టు ఎక్కించారు.

1912లో గిడుగు రామ్మూర్తి పంతులుగారు మనం మామూలుగా మాట్లాడే తెలుగు పదాలను వాడక, ఎవ్వరికీ అర్ధంకాని సంస్కృత పదాలను వాడడం మంచిది కాదని బ్రిటిష్ ప్రభుత్వానికి సలహా ఇచ్చాడు. స్వాతంత్ర్య సమరంలో గురిజాడ అప్పారావు లాంటి కవులు ప్రజలను ఉద్రేకపరచడానికి తేట తెలుగులో కవితలు రాసారు. గత 50 సంవత్సరాల సినిమా పాటల్లో తేట తెలుగు పదాలు ఎక్కవగా వున్నవే ప్రజాదరణ పొందాయి. కమ్యూనిష్టుల విప్లవ గీతాలు కూడ దీనికి నిదర్శనం.

వారపత్రికలు, సినిమాలు కొంతవరకు తేటతెలుగు వాడకం పెంపొందిస్తుంటె, మన విశ్వవిద్యాలయాలు సంస్కృత గ్రంధాలలో పరిశోధన (Research) చేసిన వారికి తెలుగు Ph.D. పట్టాలు ఇవ్వడం మొదలు పెట్టారు. ఇప్పుడు తెలుగు Ph.D. తేట తెలుగులో ఒక పేజి వ్యాసం రాయలేరంటే అతిశయొక్తి కాదు. వీరి దృష్టిలో సంస్కృతం దేవ బాష, తెలుగు నీచ బాష. తెలుగు పదాలను వాడితే అది దేశి అని, గ్రామ్యం అని, అనాగరికం అని చిన్నచూపు చూస్తారు.

గత ఇరవై ఏళ్లుగా మన దేశంలో హింది టి.వి. ప్రచారం ఎక్కువ అయ్యింది. తెలుగు విలేకరులు తమ సోమరితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి, హింది వార్తలలో వున్న సంస్కృత పదాలను గుడ్డిగా తెలుగులో వాడటం మొదలు పెట్టారు. తెలుగు బాష సంస్కృతీకరణ నన్నయ నాటి నుండి ఆరంబమైంది. గత రెండు దశాబ్దాలలో దీని వేగం తాబేలు నడక నుండి దుప్పి పరుగుగా మారింది. ఈ సంస్కృతీకరణ మన పేర్లలోకి కూడ పాకింది. ఈ రోజు చెన్నయ్య, పుల్లయ్య, ఎల్లమ్మ అన్న పేర్లు మచ్చుకు కూడ కనిపించకండా పొతున్నాయి. ఇక దేవాలయాల గురించి నేను వేరె చెప్పనవసరం లేదు. దేవుని అర్చనలు (మంత్రాలు) అన్ని సంస్కృతంలోనే. చదువుకన్నవాళ్ళు కూడ ఈ సంస్కృత మంత్రాలు విని అర్ధం కాక, బసవన్న గంట కొడితె గంగెద్దు తల వూపినట్లు, పూజారి గంటకు తలవూపి వస్తారు. హిందూమతంలో మూడనమ్మకాలు, ఆచారాలు (Rituals) పెరగడానికి ఇది ముక్యకారణం.

ఇంగ్లీష్ బాషా ప్రవీణులు తమ బాషలో 11 శాతం అసలైన ఇంగ్లీష్ పదాలు, మిగతా 89 శాతం అరువు తెచ్చుకున్నవి లేదా శాస్త్రీయం (Technical) గా పుట్టిన పదాలని చెపుతారు. న్యూయార్కు టైమ్సు దినపత్రికలో ఒక పేరాగ్రాఫ్ తీసుకొని పదాలను విబజిస్తే, 70 శాతం పదాలు అసలైన ఇంగ్లీష్ బాషకు చెందినవి, మిగతా 30 శాతం పదాలు అరువు తెచ్చుకన్న పదాలలొ నుంచి వచ్చినవి. ఇంగ్లీష్ దిన పత్రికలు ఇలాంటి క్రమశిక్షణ పాటించడంతో, ఉన్నత పాటశాల వరకు చదివిన విద్యార్ధి ఎంత క్లిష్టమైన విషయమైన చదివి అర్ధం చేసుకోగలిగే అవకాశం ఉంటుంది. తెలుగు దినపత్రికలలో ఇలాంటి క్రమశిక్షణ లేదు. తెలుగు విలేకరులు 70 శాతం సంస్కృతం, ఇంగ్లీష్, ఉర్దూ పదాలను వాడుతారు. దీనితో కళాశాల వరకు చదువుకున్నవాళ్లు కూడ అసలైన విషయాన్ని పక్కు పెట్టి, ఈ 70 శాతం పదాలతో సతమతమౌతున్నారు.

సంస్కృత పదాలను ఎలా తెలుగీకరణ చేయాలీ?

రచయిత బంగారయ్య ఇతర బాష పదాలను అరువు తెచ్చుకున్నప్పుడు పాటించవలసిన నియమాలను గురించి కొన్ని సూచనలు చేసారు. మన బాషలో సమాన పదం వుంటే వాటినే వాడాలి. 'కుక్క' అన్న తెలుగు పదం వుండగా 'శునకం' అన్న సంస్కృత పదం వాడడం సరైంది కాదు. సమాన పదం లేనప్పుడు, అలాంటి బావం వచ్చే పదాన్ని వాడుకోమన్నారు. తప్పక అరువు తెచ్చుకోవాల్సిన పరిస్తితే ఏర్పడితే, ఆ పదాన్ని మనబాషలో ఇమిడిపోయేలా మార్చాలని చెప్పారు. ఉదాహరణక ఇంగ్లీష్ పదం 'కార్' ను తెలుగులో 'కారు' అని మార్చుకున్నాం. 2500 సంవత్సరాల క్రితం, బౌద్దులు పాలి బాషలో ఈలాంటి ప్రయోగాలు చేశారు. వారు 'దర్మం' అన్న పదాన్ని 'దమ్మం' అని, 'బిక్షు' ను 'బిక్కు' అని మార్చారు.

తెలుగులో సంస్కృత శబ్ద ఉచ్చారణకు 12 అక్షరాలు (Hard Consonants – Kha, Gha etc) కలిపారు. ఈ అక్షరాలు తెలుగు బాషకు అనవసరం. తెలుగులో 'Ghanta' ను 'గంట' గా రాయవచ్చు. బంగారయ్య చేసిన సూచనలతో పాటు మరకొన్ని మార్పులు తీసుకరావాలి. సంస్కృతంలో మూలం ఏర్పడటానికి రెండు వేరు వేరు హల్లులు మిళితం అవుతాయి, అది ద్రవిడ బాషకు విరుద్దం అని ఇదివరలో చెప్పాను. సంస్కృత పదాలను తెలుగీకరణ చేయాలంటె, వీలయినంత వరకు వత్తుల వాడకం తగ్గించాలి. తెలుగు ప్రజలు 'ప్రొద్దున' అన్న పదాన్ని 'పొద్దున' అంటారు. ఇందులో 'ర' వత్తు వాడకం తీసివేసారు. 'వర్షం' అన్న పదాన్ని 'వరుషం' అని, 'అబివ్రుద్ది' ని 'అబిరుద్ది' అని వాడుకోవచ్చు. ఇలాంటి మార్పులు చేస్తే, తెలుగు బాష వినడానికి, చదవడానికి ఇంపుగా వుంటుంది.

తెలుగీకరణ చేసిన పదాలను వాడుకలోకి తీసుకురావాలంటె, మనం 'తేట తెలుగు' పదకోశాన్ని (Dictionary) తయారు చేయాలి. తరువాత తెలుగు Ph.D లు , రచయితలు, విలేకరులు క్రమశిక్షణతో ఈ పదాలను వాడి తెలుగు బాష అబివ్రుద్ధికి తోడ్పడాలి. ఇప్పుడు తెలుగు బాష మాట్లాడేవారి జనాబా ఎనిమిదిన్నర కోట్లు. ప్రపంచంలో అతి ఎక్కువగా మాట్లాడే 12 బాషలలో తెలుగు బాష ఒకటి. ముప్పయి లక్షల మంది మాట్లాడే స్వీడిష్ బాషకున్న గౌరవం మన తెలుగు బాషకు లేదు. ఇది ఎంతో దురద్రుష్టకరమైన విషయం. బాష నషించిన సమాజం చరిత్ర హీనమవుతుంది. తెలుగు బాష అబివ్రుద్ధికి అందరూ ఏకమై తెలుగీకరణకు నడుం బిగించాలని నా విన్నపం.

(published in Vaartha April 25, 2004)